

గుడ్డు @ రూ.7
కొద్దిరోజుల క్రితం వరకు గుడ్డు ధర రూ.5 ఉంటే, ప్రస్తుతం రూ.7కు చేరింది. మధ్యతరగతి, నిరుపేద ప్రజలు దూరంగా ఉంటున్నారు. 8లో▸



స్కూల్ బస్సు బీభత్సం
ప్రైవేటు స్కూల్ బస్సు బీభత్సం సృష్టించింది. ఓ మెకానిక్ దుకాణం ఎదుట ఆపిన నాలుగు వాహనాలను ఢీ కొట్టింది. 8లో▸



ఆ యాత్రను జయప్రదం చేయాలి
రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

నిరుద్యోగ దివ్యాంగులకు ఉచిత శిక్షణ

బడంగ్‌పేట్: అభిశ్రీ ఫౌండేషన్, ఏపీడీ సంస్థ సంయుక్త సహకారంతో రాష్ట్రంలోని నిరుద్యోగ దివ్యాంగులకు ఐటీఈఎస్-బీపీవో, రిటైల్, ఈ-కామర్స్ కోర్సుల్లో 45 రోజులపాటు ఉచిత శిక్షణ, హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నట్లు సంస్థ ప్రోగ్రాం మేనేజర్ మధు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సు పూర్తి చేసుకున్న దివ్యాంగులకు కావాల్సిన పరికరాలతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. 10వ తరగతి పాస్/ఫెయిల్, లేదా ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన 18 నుంచి 35 సంవత్సరాలు నిండిన దివ్యాంగులు అర్హులను పేర్కొన్నారు. దరఖాస్తుకు ఈ నెల 7 చివరి తేదీ అని, కొత్త బ్యాచ్ ఈ నెల 9 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. పీర్జాదిగూడ, ఉప్పల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 80088 49023, 97042 66406 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నూతన నియామకం



మల్లెబోయిన రాజు ముదిరాజ్

హయత్‌నగర్: తెలంగాణా తెనుగు (ముదిరాజ్) మత్స్యకార సంఘం యువత రాష్ట్ర అధ్యక్షుడిగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌కు చెందిన మల్లెబోయిన రాజు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఈటెల వెంకటేశ్వర్లు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికోసం అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

7న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సును ఈనెల 7న షాద్‌నగర్ పట్టణంలోని మినీ యూనివర్సల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జిల్లా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలతో కార్మికులు, కర్షకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రెండు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులు, కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు జిల్లా సదస్సులో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, రమేష్, సుధాకర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు



గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేత

హుడాకాంప్లెక్స్: జిల్లా యువజనోత్సవాల్లో భాగంగా మంగళవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వివిధ మండలాలకు చెందిన కళాకారులు జానపద సంగీతం, జానపద నృత్యాలను ఉత్సాహంగా ప్రదర్శించారు. ప్రథమ బహుమతి పొందిన వారికి సర్టిఫికెట్, మెమొంటోతో సత్కరించారు. ప్రథమ బహుమతి పొందిన వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో బహుమతి పొందిన వారు జాతీయ స్థాయిలో కర్ణాటకలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వరరావు, జడ్జిలు జ్వాలాముఖి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ వేట.. కాసుల మూట

భూములు సేకరించి లేఅవుట్లుగా అభివృద్ధి
- సుమారు 3 వేల ఎకరాల్లో లేఅవుట్లు..
- ఎకరాకు 600 గజాలు అసైన్డ్‌దారుకు
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో స్థలాల గుర్తింపు
- కలెక్టర్లకు లేఖలు రాసిన రాష్ట్ర ప్రభుత్వం
- భారీగా నిధులు వస్తాయని సర్కారు అంచనా



సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్ర సర్కారు కాసుల వేట సాగిస్తోంది. ఖజానా నింపుకొనేందుకు అసైన్డ్ భూములను అన్వేషిస్తోంది. వ్యవసాయేతర అవసరాలకు మళ్లిస్తున్న భూములను సేకరించి.. లేఅవుట్లుగా అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తోంది.

ధరలు ఆకాశాన్నంటడంతో..

- రాజధానికి చేరువలో ఉన్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. పారిశ్రామికాభివృద్ధి, ఐటీ కంపెనీల తాకిడితో ఈ రెండు జిల్లాల్లో నగరీకరణ శరవేగంగా జరుగుతోంది. దీంతో స్థిరాస్తి రంగం మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే అసైన్డ్ భూములు సైతం పరాధీనమవుతున్నాయి. భూమిలేని నిరుపేదలకు జీవనోపాధి నిమిత్తం వివిధ దశల్లో రాష్ట్ర ప్రభుత్వం భూములను పంపిణీ (అసైన్‌మెంట్) చేసింది.
- ఈ భూములను వ్యవసాయ సాగుకు మాత్రమే వినియోగించుకోవాలని నిర్దేశించింది. ఒకవేళ ఇతర అవసరాలకు మళ్లించినా.. క్రయవిక్రయాలు జరిపినా చట్టరీత్యా నేరం. ఇవేమీ పట్టని కొందరు ఈ భూములను యథేచ్ఛగా విక్రయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే కారుచౌకగా ఈ భూములు అందుబాటులో ఉండడంతో బడాబాబులు, ప్రజాప్రతినిధులు ఇబ్బడిముబ్బడిగా కొనుగోలు చేశారు.
- ఇలా అసైన్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించినా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఈ భూముల క్రయ విక్రయాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే అన్యాక్రాంతమవుతున్న అసైన్డ్ భూములను గుర్తించిన ప్రభుత్వం.. వీటిని ప్లాట్లుగా అభివృద్ధి చేయడం ద్వారా నిధులు సమీకరించుకోవాలనే ఆలోచన చేసింది. నగరానికి సమీపంలో ఉన్న ఈ తరహా భూములను గుర్తించి.. వాటిని లేఅవుట్లుగా అభివృద్ధి చేసి వేలం వేయాలని నిర్ణయించింది. ఈ అభివృద్ధి చేసిన భూమిలో ఎకరాకు 600 చదరపు గజాలను అసైన్డ్‌దారులకు ఇచ్చే విధంగా ప్రణాళిక తయారు రూపొందించింది.

గజం రూ.40 వేల చొప్పున..

ఉప్పల్ భగాయత్‌లో పట్టాదారుల భాగస్వామ్యంతో సేకరించిన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) లేఅవుట్లుగా అభివృద్ధి చేసింది. దీంట్లో డెవలప్ చేసి ఎకరాకు వేయి గజాల చొప్పున పట్టాదార్లకు కేటాయించింది. ఇదే పద్ధతిని అసైన్డ్ భూములకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా మార్గదర్శకాలను ఖరారు చేసి భూములను గుర్తించాలని కలెక్టర్లకు లేఖ రాసింది. ఈ మేరకు చర్లపటేల్‌గూడ, కుర్మల్‌గూడ, తొర్రూర్, కవాడిపల్లి, చందానగర్, మునగనూరు, కొల్లూరు, పసుమాముల, తుర్కయంజాల్, లేమూరు, కొల్లూరులలో దాదాపు 3వేల ఎకరాలను ప్రాథమికంగా ఎంపిక చేసింది.

- సేకరిస్తున్న అసైన్డ్ భూములకు ఆయా ప్రాంతాల్లో ఉన్న విలువ ఆధారంగా ఎకరాకు 600 గజాల నుంచి 800 వరకు ఇవాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రైవేటు భూములతో పోలిస్తే అసైన్డ్ భూములకు ధర తక్కువ. వీటి క్రయవిక్రయాలపై నిషేధం ఉన్నందున.. ఇవి ఎకరాకు రూ.25 లక్షలు కూడా లభిస్తున్నాయి.
- ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న సర్కారు వీటిని లేఅవుట్లుగా అభివృద్ధి చేయడం ద్వారా గజాన్ని సగటున రూ.40వేల చొప్పున విక్రయించవచ్చని అంచనా వేస్తోంది. దీంతో అటు అసైన్డ్‌దారులు.. ఇటు ప్రభుత్వానికి ఉభయతారకంగా లబ్ధి చేకూరుతుందని భావిస్తోంది. ఎన్నికల సంవత్సరం కావడం.. సంక్షేమ పథకాలకు నిధులు భారీగా అవసరం ఉండడంతో సాధ్యమైనంత త్వరగా అసైన్డ్ భూములను సేకరించి వెంచర్లుగా అభివృద్ధి చేసి నిధులను సమకూర్చుకోవాలనుకుంటోంది. దీంతో ఈ ప్రక్రియను వడివడిగా పూర్తి చేయాలని కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది.

నెల రోజుల్లో దుర్గం చెరువు ఎస్టీపీ

సాక్షి, సిటీబ్యూరో: దుర్గం చెరువు వద్ద జలమండలి నూతనంగా నిర్మిస్తున్న మురుగు శుద్ధి కేంద్రాన్ని నెలరోజుల్లో అందుబాటులోకి తేనున్నట్లు జలమండలి ఎండీ దానకిశోర్ తెలిపారు. దుర్గం చెరువు, కోకాపేట్, అత్తాపూర్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఎస్టీపీలను మంగళవారం ఆయన సందర్శించారు. దుర్గం చెరువు వద్ద 7 మిలియన్ లీటర్ల శుద్ధి సామర్థ్యం, సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ ఎస్టీపీ సివిల్ పనులు 95 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఎస్టీపీల ప్రాంగణాల్లో ఆహ్లాదకర వాతావరణం, పచ్చదనం కోసం గార్డెనింగ్, అవసరమైన మొక్కలు నాటాలని సూచించారు. నగరంలో 16 చోట్ల 978 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఎస్టీపీలను ఈ ఏడాది జూలై నాటికి పూర్తి చేసి జీహెచ్ఎంసీ పరిధిలో వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేయనున్నామన్నారు. మిగిలిన 11 ప్రాంతాల్లోని ఎస్టీపీలను నవంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించామన్నారు. ఆయన వెంట ఈడీ సత్యనారాయణ, ప్రాజెక్టు విభాగం డైరెక్టర్ శ్రీధర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

'గాంధీ'కి ఆరుగురు కొత్త ఆర్ఎంఓలు



గాంధీ ఆస్పత్రి: గాంధీఆస్పత్రిలో కొత్తగా ఆరుగురు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు (ఆర్ఎంఓ) మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, ఆర్ఎంఓ-1 జయకృష్ణను వీరు కలిశారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించి, రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆర్ఎంఓలు కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుభాన్ హుస్సేన్, జీఎం సంతోష్ వెంకట రమణ పాల్గొన్నారు.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా : భారీగా ట్రాఫిక్ జాం



అబ్దుల్లాపూర్‌మెట్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి వద్ద గ్యాస్ ట్యాంకర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. గుజరాత్ నుంచి హైదరాబాద్ మీదుగా చెన్నై వెళ్తున్న గ్యాస్ టాంకర్ మంగళవారం సాయంత్రం నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ రహదారిపై రోడ్డుకు అడ్డంగా పడడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.

ప్రజలపై పన్నుల భారం

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: టీఆర్ఎస్ పాలనలో అధిక పన్నులు, నీటి బిల్లులతో పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం పడుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి విమర్శించారు. అధిక పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని బీజేపీ క్వార్టర్స్, దీన్‌దయాళ్‌నగర్, పాష్ కాలనీ, సాయికృపానగర్ కాలనీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలో లేని పన్నుల విధానం మనకే ఎందుకని ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు నివసించే మీర్‌పేట ప్రాంతంలో వెంటనే అధిక పన్నులు, నీటిబిల్లుల భారాన్ని తగ్గించాలని, లేకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సిద్దాల శ్రీశైలం, నిమ్మల వెంకటేశ్, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, గంగమ్మ, బిచ్చనాయక్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్, చల్లా రామకృష్ణారెడ్డి, తాజుద్దీన్, ఎండీ యూసఫ్, శంకర్, వెంకటేశ్, ఐతరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అధిక పన్నులు, నీటి బిల్లులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

'కంటి వెలుగు' ఓ వరం

- మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప ఆలోచనతో చేపడుతున్న కంటి వెలుగు వరం లాంటిదని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్యక్రమంపై మంత్రులు హరీశ్ రావు, జగదీష్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి మంత్రి సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 18న కంటి వెలుగు కార్యక్రమం కోసం రంగారెడ్డి జిల్లాలో 80 బృందాలతో పాటు అదనంగా మరో 5 బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఈ నెల 12వ తేదీలోపు జిల్లాస్థాయి సమావేశం నిర్వహించి, జిల్లాలోని ప్రజాప్రతినిధుల సహకారంతో 558 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతం చేస్తామని చెప్పారు. ఇప్పటికే 83,645 రీడింగ్ గ్లాస్‌లు జిల్లాకు వచ్చాయని మంత్రి వివరించారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎంపీ లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీలు వాణీదేవి, దయానంద్‌గుప్తా, కలెక్టర్ అమయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు, పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

తెలంగాణలో దినదినాభివృద్ధి



చేవెళ్లలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

- మంత్రి సబితారెడ్డి
- చేవెళ్ల మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

చేవెళ్ల: తెలంగాణలో ఎంతో అభివృద్ధి జరుగుతోందని ఈ అభివృద్ధిని దేశావ్యాప్తం చేసేందుకు కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో చేవెళ్ల ప్రాంతం మరింతగా పురోభివృద్ధి సాధించి హైదరాబాద్‌లో కలిసిపోతుందన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి మంగళవారం చేవెళ్లలో రూ.60లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన, రూ.15లక్షలతో ఇంద్రారెడ్డి మెమోరియల్ పల్లె ప్రకృతి వనం ప్రారంభం, రేగడిఘనాపూర్‌లో రూ.కోటితో బ్రిడ్జికి శంకుస్థాపన, సింగప్పగూడలో రూ.కోటితో బ్రిడ్జికి శంకుస్థాపన, రూ.37లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. షాబాద్‌లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయని మరికొన్ని కంపెనీలు రాబోతున్నాయని చెప్పారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో దేశం ఎంతో పురోగతి సాధిస్తోందని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. గతంతో పోలిస్తే తెలంగాణ వచ్చిన తరువాత గ్రామాలు ఎలా అభివృద్ధి చెందాయో ప్రజలకు బాగా తెలుసన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎం. విజయలక్ష్మి, జెడ్పీటీసీ మర్పల్లి మాలతి, వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింలు, చేవెళ్ల, రేగడిఘనాపూర్, సింగప్పగూడ గ్రామాల సర్పంచులు బండారి శైలజ, ఆర్.నర్సింలు, రహీమాబేగం, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు వాసవి, రవీందర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, శివారెడ్డి, మోహన్‌రెడ్డి, భీమయ్య, ఎండీ అలీ, గంగి యాదయ్య, రాములు, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, వెంకట్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాంరెడ్డి, రఘువీర్‌రెడ్డి, తోట చంద్రశేఖర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, వెంకటేశ్, యాదయ్య, మోసిన్, శ్రీనివాస్, మల్లారెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

చేవెళ్లలోని జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు.

క్వారీకి అనుమతి వద్దు

- ఇళ్లు కూలిపోతున్నాయి
- పంటలు పాడవుతున్నాయి
- రోగాలబారిన పడుతున్నాం
- వెలిజర్లలో క్వారీ ఏర్పాటు అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ
- తీవ్రంగా వ్యతిరేకించిన గ్రామస్తులు



క్వారీ యజమాని వాహనాన్ని చుట్టుముట్టిన గ్రామస్తులు

షాద్‌నగర్: 'అర్ధరాత్రి వేళ గుట్టలను పేల్చేందుకు బ్లాస్టింగ్ చేస్తున్నారు.. బండరాళ్లు ఇళ్లపై పడి కూలిపోతున్నాయి.. పంటలు నాశనం అవుతున్నాయి.. ఎట్టి పరిస్థితుల్లోనూ క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు.. చందాలు వేసుకొనైనా డబ్బులిస్తాం.. మాకు మద్దతివ్వండి' అంటూ ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులతో గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. షాద్‌నగర్ పరిధిలోని వెలిజర్ల శివారులో కర్ణపాల్‌రెడ్డి స్టోన్, మెటల్ క్వారీ ఏర్పాటు అనుమతుల కోసం మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు.

ఇళ్లు బీటలు వారుతున్నాయ్

వెలిజర్ల శివారు సర్వే నంబర్ 76, 77, 78, 79లో ఉన్న 6.81 హెక్టార్ల భూమిలో స్టోన్, మెటల్ క్వారీ ఏర్పాటు కోసం రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఆర్డీఓ రాజేశ్వరి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సంగీత ప్రజల అభిప్రాయాన్నిసేకరించారు. ఇప్పటికే ఉన్న క్వారీలో బ్లాస్టింగ్‌లతో సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో రాళ్లు, బండలు పడుతున్నాయని, పేలుళ్ల దాటికి ఇళ్లు బీటలు వారుతున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేకుల ఇళ్లపై రాళ్లు పడుతుండటంతో పైకప్పులు కూలుతున్నాయని తెలిపారు. క్రషర్ కారణంగా తాము వేసి పంటలపై దుమ్ముధూళి విపరీతంగా పడి దెబ్బతింటున్నాయని.. ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోయారు. రోగాల బారిన పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం క్రషర్, క్వారీ నుంచి టిప్పర్లు అతి వేగంగా, అజాగ్రత్తగా వెళ్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నామని పేర్కొన్నారు. గ్రామస్తులమంతా చందాలు వేసుకొని డబ్బులు ఇస్తామని అధికారులు తమకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

డబ్బుల పంపిణీ

ప్రజాభిప్రాయ సేకరణకు క్వారీ నిర్వాహకులు బయటి ప్రాంతాలకు చెందిన వారిని పెద్ద ఎత్తున పిలిపించారు. వారంతా క్వారీకి అనుమతులు ఇవ్వాలని మద్దతు తెలిపారు. కార్యక్రమం ముగిసిన వెంటనే యజమాని డబ్బుల పంపిణీ ప్రారంభించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అడ్డుకున్నారు. యజమాని వాహనాన్ని చుట్టుముట్టారు. దీంతో క్వారీ యజమాని అక్కడి నుండి వెళ్లిపోయారు. అనంతరం బయటి నుంచి వచ్చిన వ్యక్తులు డబ్బుల కోసం ఆయన కారును వెంబడించడం గమనార్హం.



ప్రజాభిప్రాయ సేకరణలో ఆర్డీఓ రాజేశ్వరి, పీసీబీ ఈఈ సంగీత

భయంభయంగా గడుపుతున్నాం



క్వారీలో బ్లాస్టింగ్‌లతో రాళ్లు, బండలు పశువులపై పడి మృత్యువాతపడుతున్నాయి. పాలు పిండేందుకు పొలాలకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది. క్వారీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దు.

– దొడ్డి రవీందర్, వెల్జర్ల

పంటలు నష్టపోతున్నాం



పొలాల్లో వేసిన పంటలపై క్రషర్ నుంచి వచ్చే దుమ్ము విపరీతంగా పడుతోంది. పూత పూయడం లేదు, కాత రావడం లేదు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న మేము ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నాం.

– శంకరయ్య, రైతు, వెల్జర్ల

మూసీ మెరిసేలా!





చారిత్రక మూసీ నదిపై అత్తాపూర్ సమీపంలో నగర చరిత్ర, సంస్కృతీ వారసత్వాన్ని ప్రతిబింబించేలా వంతెనలు, సుందరమైన రహదారులను ప్రభుత్వం నిర్మించనుంది. ఆ నమూనా చిత్రాలే ఇవి. వీటిని ప్రముఖ ఆర్కిటెక్ట్ సంస్థ ఆస్కార్ అండ్ పొన్ని డిజైన్ చేసింది.

– సాక్షి, సిటీబ్యూరో



సందర్శకులు మురిసేలా!

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి మొదటిరోజు మంగళవారం సందర్శకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ ఔషధ వనంతో పాటు ఎకరంన్నర స్థలంలో వలయాకారంలో 27 నక్షత్రాలు, 9 గ్రహాల పేరుతో మొక్కలతో తీర్చిదిద్దిన నక్షత్ర వనం అలరించాయి. అందమైన పూల తోటలు, మామిడి, సపోటా, దానిమ్మ, కొబ్బరి తోటలు, భారీ వృక్షాలు, బటర్‌ఫ్లై గార్డెన్ పాఠశాల విద్యార్థులను, పెద్దలను విరివిగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 15 వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులను అనుమతిస్తారు.

– రసూల్‌పురా



సంఘర్షణ యాత్రను సక్సెస్ చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్



సంఘర్షణ యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్రను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్, ట్రాన్స్‌పోర్ట్ జిల్లా కార్యదర్శి రుద్ర కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం చేవెళ్లలో యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మోటార్ వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలని, పెట్రోల్ డీజిల్, వంట గ్యాస్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. రవాణా రంగ కార్మికులకు బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మణ్‌నాయక్, అల్లి దేవేందర్, నర్సింలు గౌడ్, రవి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్డు @ రూ. 7

- నెల రోజులుగా పెరుగుతున్న ధరలు
- మధ్యతరగతి ప్రజలకు భారం
- మధ్యాహ్న భోజన పథకంపై ప్రభావం



కేశంపేట: కోడిగుడ్డు ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో మధ్యతరగతి, నిరుపేద ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. నెల రోజుల క్రితం హోల్‌సేల్ మార్కెట్‌లో 12 గుడ్ల ధర రూ. 54 కాగా ప్రస్తుతం 68 రూపాయలకు చేరింది. కొద్దిరోజుల క్రితం వరకు ఒక్క గుడ్డు ధర రూ. 5లు ఉంటే, ప్రస్తుతం రూ. 7కు చెరుకుంది. దీంతో మధ్యతరగతి, నిరుపేద ప్రజలు గుడ్డుకు దూరంగా ఉంటున్నారు. గుడ్డు రేటు పెరగడంతో తమ ఆదాయం తగ్గిందని హోటళ్లు, బేకరీల నిర్వాహకులు వాపోతున్నారు. కేక్‌ల తయారీకి ఎక్కువ గుడ్లు కావాల్సి ఉంటుందని, ధర ఎక్కువ ఉండడంతో లాభం రావడం లేదని తెలిపారు. చలికాలం కావడంతో గుడ్డుకు డిమాండ్ పెరిగినట్లు తెలిసింది. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే గుడ్లను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుండడం కూడా ధరలు పెరగడానికి కారణమవుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు రెండు రోజులకు ఒక్కసారి గుడ్డును ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ. 4.50పైసలు మాత్రమే చెల్లిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో గుడ్డు ధర రూ. 7 ఉండడంతో చాలా పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్డు ఇచ్చేందుకు నిర్వాహకులు ఇష్టపడడం లేదు.

అమ్మకాలు తగ్గాయి



కోడిగుడ్డు ధర పెరగడంతో షాపుల్లో అమ్మకాలు బాగా తగ్గాయి. ప్రభుత్వం కోడిగుడ్ల ధరలను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలి. హోల్‌సేల్‌గా ధరలు పెరగడంతో షాపుల్లో కూడా ధర పెంచాల్సి వస్తోంది.

– రామకృష్ణ, కిరాణాషాపు యజమాని, పాపిరెడ్డిగూడ

కొనాలంటే భయమేస్తోంది



ప్రస్తుతం కోడి గుడ్డు ధర విపరీతంగా పెరిగింది. గతంలో ఎప్పుడూ గుడ్డు ధర రూ. 7లు దాటలేదు. గుడ్డు ధరలు విపరీతంగా పెరగడం వల్ల తినాలంటేనే భయమేస్తోంది. ప్రభుత్వం గుడ్ల ధరలను నియంత్రించాలి.

– భీమయ్య, కాకునూర్ గ్రామం

క్లుప్తంగా

దాడి కేసులో యువకుని రిమాండ్

ఇబ్రహీంపట్నం: వివాహితపై స్క్రూ డ్రైవర్‌తో దాడి చేసి గాయపరిచిన యువకున్ని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలో నివాసముండే ఓ వివాహితకు ఫేస్‌బుక్ ద్వారా యువకుడు పరిచయమ్యాడు. ఆ పరిచయాన్ని ఆసరా చేసుకొని పెళ్లి చేసుకోవాలని వెంటపడ్డాడు. బెదిరింపులకు పాల్పడడమే కాకుండా మహిళ ఇంట్లోకి చొరబడి గాయపరిచాడు. ఇందుకు కారణమైన మంచాల మండలం రంగాపూర్‌కు చెందిన శివకాంత్(28)ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

కారును ఢీకొట్టిన బస్సు

ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

అబ్దుల్లాపూర్‌మెట్: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని వనస్థలిపురానికి చెందిన పడాల అనిల్, అతని స్నేహితులు శ్రీధర్, నవీన్‌కుమార్ కారులో తిరుపతికి వెళ్లి మంగళవారం హైదరాబాద్‌కు బయలుదేరారు. అబ్దుల్లాపూర్‌మెట్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న గూడ కృష్ణమాచార్యులు

ఆమనగల్లు: పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన గోవిందగోపాల గోశాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు గూడ కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేసి గోశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పూజారులు దేవేందరశెట్టి, శాంతమ్మ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎడ్‌సెట్ కన్వీనర్‌కు వైస్‌చాన్స్‌లర్ రీసెర్చర్ అవార్డు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ ఎడ్‌సెట్‌కు మూడు సార్లు కన్వీనర్‌గా కొనసాగిన ప్రొ.రామకృష్ణ వైస్ చాన్స్‌లర్ రీసెర్చ్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. మంగళవారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి, హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, ఓయూ వీసీ ప్రొ.రవీందర్ తదితరులు ప్రొ.రామకృష్ణకు అవార్డు అందజేశారు. కేటగిరి–1 విభాగంలో ప్రొ.రామకృష్ణతో పాటు సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు ప్రొ.శశికాంత్, కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొ.మురళీధర్‌రెడ్డి అవార్డులు అందుకున్నారు. ప్రత్యేక విభాగంలో డా.జ్యోతి, డా.అశోక్‌కుమార్, సీబీఐటీ అధ్యాపకులు డా.సుధాకర్‌బాబు అవార్డులు అందుకున్నారు. ప్రాజెక్టు పూర్తి చేసిన పలువురు అధ్యాపకులకు అభినందన పత్రాలు అందచేశారు. రీసెర్చ్ పబ్లికేషన్స్, సదస్సుల్లో పరిశోధన పత్రాల సమర్పణ, రీసెర్చ్ ప్రాజెక్టులను పరిగణలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేశారు. ఓయూలో 52మంది పోటీ పడగా ముగ్గుర్ని ఎంపిక చేసినట్లు తెలిపారు.

నాలుగేళ్లు గడిచినా పూర్తికాని పనులు

- నిధుల కొరత, నిర్లక్ష్యమే కారణం

చెరువులకు ఆదరువు ఎన్నడో!

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని 185 చెరువుల ప్రక్షాళనతో పాటు సుందరీకణతో అభివృద్ధి చేస్తామన్న ప్రకటనలు నాలుగేళ్లు గడిచినా అమలుకు నోచుకోలేదు. అభివృద్ధి పనుల కోసం 2018లో రూ.282.62 కోట్లు మంజూరైనా పనుల జాడే లేదు. మంజూరైన నిధులు కాగితాల్లో తప్ప విడుదల కాకపోవడం అందుకు ఒక కారణం కాగా, సగానికి పైగా నిధులు ఆలస్యంగా విడుదలైనప్పటికీ శ్రద్ధ చూపని అధికారుల నిర్లక్ష్యం మరో కారణం. చెరువుల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రక్షాళనలో భాగంగా పూడికతీత చేపట్టాలని భావించారు. ప్రక్షాళన తర్వాత తిరిగి కలుషితం కాకుండా చెరువుల్లో కలుస్తున్న మురుగును తరలించడంతోపాటు ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తీసిన పూడికను కట్టల నిర్మాణంలో ఉపయోగించాలని భావించారు.

నిధుల కొరత కొంత.. నిర్లక్ష్యం ఇంకొంత..

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం.. జీహెచ్ఎంసీ వద్ద సైతం నిధులు లేకపోవడంతో పూడికతీత పనులైనా మిషన్ కాకతీయ నిధులతో చేయాలని భావించారు.మిషన్ కాకతీయ కింద నిధులు విడుదలైనప్పటికీ పూడికతీత, ప్రక్షాళన పనులు జరగలేదు. ఇక ఎస్టీపీల నిర్మాణం, సుందరీకరణ పనులు కూడా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సంస్థల నుంచి సీఎస్సార్ నిధులతో కొన్ని చెరువుల పనులైనా పూర్తిచేసి అందంగా తీర్చిదిద్దాలనుకున్నారు. అవీ పూర్తికాలేదు. మొత్తం 185 చెరువులకు 50 చెరువుల్లో ఎలాంటి మురుగునీరూ కలవడం లేదని తేల్చారు. మిగతా వాటిల్లో 21 చెరువుల్లో మురుగునీటి మళ్లింపు పనుల్ని మిషన్‌కాకతీయ, సీఎస్సార్ నిధులతో పూర్తి చేశారు. మరో 8 చెరువుల వద్ద మిషన్ కాకతీయ నిధులతో పనులు జరుగుతున్నాయి. ఇలా మిషన్ కాకతీయ, సీఎస్సార్‌ల ద్వారా నిధులు సమకూర్చుకున్నా పనులు పూర్తికాలేదు.



జీహెచ్ఎంసీ నుంచి రూ.167 కోట్లు..

ఈ నేపథ్యంలో మురుగునీటి మళ్లింపుతోపాటు చెరువు కట్టల బలోపేతం, తూముల ఏర్పాటు వంటి పనులకు జీహెచ్ఎంసీ నిధులు రూ167 కోట్లు కేటాయించారు. వీటితో 63 చెరువుల్లో మురుగు నీటి మళ్లింపు పనులుచేపట్టగా పది పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు. కోర్టు వివాదాల వంటి కారణాలతో 14 చెరువుల పనులు నిలిపివేశారు. మిగతా పనుల్ని దశలవారీగా చేస్తామని చెబుతున్నారు. అవి ఎప్పుడు పూర్తి చేస్తారో, అందుకు ఎంతకాలం పడుతుందో సంబంధిత అధికారులకే తెలియాలి. నిధుల లేమితో వాటర్‌బోర్డుకు 17 చెరువుల వద్ద ఎస్టీపీల నిర్మాణ బాధ్యతలప్పగించారు.

స్కూల్ బస్సు బీభత్సం

- నాలుగు బైక్‌లను ఢీకొట్టిన వైనం
- బొంగ్లూర్ గేటు సమీపంలో ఘటన
- పిల్లలు సురక్షితం



ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు స్కూల్ బస్సు మంగళవారం రాత్రి బీభత్సం సృష్టించింది. త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. విద్యార్థులు బస్సులోనే ఉండగా డ్రైవర్ నిర్లక్ష్యం వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వనస్థలిపురం నాగార్జున స్కూల్‌కు చెందిన బస్సు రాత్రి 7 గంటలకు విద్యార్థులతో బొంగ్లూర్ నుంచి ఎంపీపటేల్‌గూడకు బయలుదేరింది. బొంగ్లూర్‌లోని ఓ మెకానిక్ దుకాణం ముందు ఆపిన నాలుగు వాహనాలకు బస్సు ఢీ కొట్టింది. ఆ ప్రాంతంలో పాదచారులు, ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. అంతకు ముందే రోడ్డు మీద ఆటోను ఢీ కొట్టినట్లు ప్రజలు తెలిపారు. డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకపోవడం వల్లే ఇలా జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

మార్కెట్ పనులు ప్రారంభం



మణికొండ: నార్సింగిలో కూరగాయలు, మాంసాహార మార్కెట్ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మంగళవారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏకంగా రూ. 4 కోట్లతో అధునాతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి గతంలోనే ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. స్థానిక వ్యాపారులు దశాబ్దాలుగా సదరు స్థలంలో తమ షెడ్‌లు ఉన్నాయని వాటిని తొలగిస్తే మా జీవనాధారాన్ని కోల్పోతామని పశువుల వ్యాపారస్తులు అడ్డుకున్నారు. వారిని మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ సముదాయించి పనులను ప్రారంభించారు. అన్ని రకాల కూరగాయలు, మాంసాహారాలు ఒకే చోట లభిస్తాయని వివరించారు. కో– ఆప్షన్ సభ్యుడు మహ్మద్, స్థానికులు పాల్గొన్నారు.